నిరంకుశ పాలనకు చరమగీతం

ప్రొఫెసర్ కోదండరాం


ఆర్టీసీ యూనియన్ నాయకుడు రాజిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పదేళ్ల నిరంకుశ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ×టీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్₹(ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి పదవీవిరమణ సందర్భంగా అభినంద నసభ జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అన్ని వ్యవస్థలు నష్టపోయాయని అందులో ఆర్టీసీ కూడా ఆర్థికంగా నష్టపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఆరు గ్యారంటీ పథకాల ద్వారా ప్రజల్లో మంచి గుర్తింపును తెచ్చుకుంటుందని అభిప్రాయపడ్డారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, రాష్ట్ర నాయకులు ఆర్.డీ.చంద్రశేఖర్, మదర్‌డైరీ మాజీ ఎండి యుగేంధర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, అబ్రహం, గోపాల్, సాయిరెడ్డి, వీ.ఎస్.గౌడ్, కె.రాజలింగం, అంబటి నాగయ్య తదితరులు పాల్గొని రాజిరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు.

కార్మికవర్గ పక్షపాతి కిరణ్‌కుమార్


సంతాపసభలో నివాళులర్పిస్తున్న పోటు రంగారావు తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కార్మిక వర్గ పక్షపాతి కిరణ్‌కుమార్ అని సిపిఐఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. కార్మికులు, కర్షకుల కోసం నిరంతరం పోరాటం చేసిన గొప్ప నాయకులని కొనియాడారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐఎఫ్‌టీయూ, తెలంగాణ ప్రొగ్రెసివ్ ఆటో అండ్ మోటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కిరణ్‌కుమార్ సంతాప సభను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆటో, మోటర్ వర్కర్స్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఆర్టీఓలను సైతం నిలదీసి ఆటో వర్కర్స్‌ల సమస్యలను పరిష్కరించారన్నారు. యూనియన్ అధ్యక్షుడు ప్రవీణ్, మాస్ లైన్ కార్యవర్గ సభ్యులు కె.రమ, ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, మాస్‌లైన్ గ్రేటర్ కార్యదర్శి ఎం.అన్మేష్, ఐఎఫ్‌టీయూ హైదరాబాద్ అధ్యక్షులు ఎస్.ఎల్.పద్మ, లింగంగౌడ్, అనురాధా, నరేందర్, ఎస్.రవీందర్, జి.ఝాన్సీ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

సికింద్రాబాద్ గెలవాల్సిందే !

హైదరాబాద్‌లో పట్టు నిలుపుకోవాలన్న ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్


మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్


గజమాలతో సత్కరిస్తున్న పరకాల రజనీకాంత్‌గౌడ్ తదితరులు

ముషీరాబాద్: బీఆర్ఎస్ హైదరాబాద్‌లో నిలబడాలంటే సికింద్రాబాద్ పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించాలని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని హెరిటేజ్‌హాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సభకు భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు అధ్యక్ష వహించగా ముఖ్య అతిథిగా హాజరైన పద్మారావుగౌడ్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెంది ప్రతిపక్షంలో కూర్చున్నామన్నారు. అన్ని సీట్లలో బీఆర్ఎస్ విజయం సాధించిందని నగరంలో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేదని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వచ్చిన మెజార్టీ చూస్తే పార్లమెంటు సికింద్రాబాద్ ఎన్నికల్లో లక్ష మెజార్టీతో విజయం సాధించి చరిత్ర సృష్టిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పదవులను అనుభవించి తమ సొంత ప్రయోజనాల కోసం పార్టీని వదిలి కొంతమంది బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు రాజకీయ, మానసికంగా దెబ్బతీసేందుకు కాంగ్రెస్‌లో 12 మంది ఎమ్మెల్యేలు చేరుతున్నారని, సోషల్ మీడియాలో గత కొద్ది రోజులుగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు గ్యారంటీల పేరుతో అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంటు ఎన్నికల్లో వారి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. స్థానిక ఎంపీ కిషన్‌రెడ్డి ఇప్పటి వరకు సికింద్రాబాద్‌లో ఎక్కడా కనిపించలేదని విమర్శించారు. ఈ రెండు పార్టీల నేతలను నమ్మరని ఈ ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ, మాజీ కార్పొరేటర్లు శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల భాగ్యలక్ష్మిహరిబాబుయాదవ్, ముఠా పద్మ, మాచర్ల పద్మజ, నియోజకవర్గం ఆరు డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, వల్లాల శ్యామ్‌యాదవ్, సయ్యద్ అహ్మద్ భక్తియార్, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, సోమన్, సుధాకర్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, జహీరుద్దీన్, సమర్, బల్లా ప్రశాంత్ తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో నేను చేరడం లేదు..

తాను బీఆర్ఎస్ పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. అవాస్తవ ప్రచారాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు నమ్మొద్దు. గిట్టని వారు ఈ దుష్ప్రచారం చేస్తున్నారు.
– ఎమ్మెల్యే ముఠా గోపాల్

గాజులు ఘల్లుమంటున్నాయ్!


లాడ్‌బజార్‌లోని ఓ దుకాణంలో..

చార్మినార్: లాడ్‌బజార్‌లో రంజాన్ మార్కెట్ జోరుగా కొనసాగుతోంది. దుకాణాలన్నీ మహిళలతో కళకళలాడుతున్నాయి. ఉదయం నుంచి మరుసటి రోజు తెల్లవారు జాము వరకు తెరిచే ఉంటున్నాయి. రాత్రిపూట విద్యుత్ దీప కాంతుల్లో లాడ్‌బజార్ గాజుల దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో కేవలం నగర ప్రజలే కాకుండా తెలంగాణ జిల్లాల నుంచి మహిళలు ఇక్కడికి వచ్చి తమకు నచ్చిన గాజులను ఖరీదు చేస్తున్నారు. ఎండను సైతం లెక్క చేయకుండా మహిళలు తమకు ఇష్టమైన రంగు రంగుల గాజులను ఖరీదు చేయడంలో నిమగ్నమయ్యారు. రూ.5 నుంచి 10వేల వరకు అందుబాటులో ఉన్నాయి.

కిక్కిరిసిపోతున్న దుకాణాలు..

ఓవైపు రంజాన్ మార్కెట్ కొనసాగుతుండగా.. మరోవైపు పెళ్లిళ్ల సీజన్ కావడంతో లాడ్‌బజార్‌ను సందర్శించకుండా వివాహ వేడుకలు చేయలేని వారుండరు. పెళ్లి కూతురును చేసే సమయంలో ఆహ్వానితులుగా వచ్చే అతిథులందరికీ గాజులను అందజేయడం ఆనవాయితీగా మారడంతో పెళ్లి కూతురుతో పాటు అతిథులకు బహుమతిగా ఇచ్చే గాజులను కూడా లాడ్‌బజార్‌లో ఖరీదు చేయడానికి చాలా మంది ఇష్ట పడుతుంటారు.

చార్మినార్ పక్కనే..

చార్మినార్ పడమర వైపు పాదం దగ్గర పుట్టిన ఒక వెలుగుల వీధి లాడ్‌బజార్. ప్రస్తుతం లాడ్‌బజార్‌లో దాదాపు 250కి పైగా దుకాణాలు రోజు తమ వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నాయి. పెళ్లిళ్ల సీజన్ సందర్భంగా ప్రత్యేకమైన ఆఫర్లతో లాడ్‌బజార్‌లోని గాజుల దుకాణదారులు వినియోగదారులకు మరింత చేరువయ్యారు. ఆఫర్లకు ఆకర్షితులవుతున్న వినియోగదారులు గాజుల కొనుగోలు కోసం ఉత్సాహం చూపిస్తున్నారు. ప్రస్తుతం లాడ్‌బజార్ రంజాన్ మార్కెట్‌లో ఎటు చూసినా సందడే..సందడి కనిపిస్తుంది. సాధారణ రోజుల్లో నిత్యం రద్దీగా ఉండే లాడ్‌బజార్ ప్రస్తుతం రంజాన్ మాసంతో పాటు పెళ్లిళ్ల సీజన్ కావడంతో మరింత రద్దీగా మారింది.

నియామకం



కాచిగూడ: అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా చేపూరి రాజును నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు హెచ్.ఫాస్మీ శుక్రవారం నియామకపు పత్రాన్ని అందజేశారు. రాజు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీ తెలంగాణ రాష్ట్ర బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హెచ్.ఫాష్మీ, కదీర్ అలీఖాన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో పార్టీ విస్తరణకు కృషి చేస్తానని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 17 ఎంపీ స్థానాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు.

ఓబీసీ సెంట్రల్ కమిటీ స్టేట్ కన్వీనర్‌గా సైదులు


నియామకపత్రాన్ని అందజేస్తున్న భాగ్యలక్ష్మి

కాచిగూడ: ఓబీసీ సెంట్రల్ కమిటీ దళిత విభాగం తెలంగాణ స్టేట్ కన్వీనర్‌గా సైదులును నియమించినట్లు ఓబీసీ సెంట్రల్ కమిటీ జాతీయ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు కాచిగూడలోని ఓబీసీ సెంట్రల్ కమిటీ కార్యాలయంలో సైదులకు ఆమె నియామకపత్రాన్ని అందజేశారు. మహిళా బిల్లులో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రకులాల పేదలకు సబ్ కోటా కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి ఆమె విజ్ఞప్తి చేశారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటాను కల్పించాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయింపులో బీసీ మహిళలకు అన్యాయం చేశాయని విమర్శించారు. ఓబీసీ సెంట్రల్ కమిటీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలిగా బాలినేని లక్ష్మికి ఈ సందర్భంగా నియామకపత్రాన్ని అందజేశారు.

ఘంటసాల గొప్ప దేశ భక్తుడు


సన్మానిస్తున్న వంశీరామరాజు, రామసత్యనారాయణ

చిక్కడపల్లి: ఘంటసాల కేవలం సినీ గాయకుడు మాత్రమే కాదని ఆయన దేశ స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించిన గొప్ప దేశ భక్తుడని సద్గురు ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ స్థాపకుడు వంశీ రామరాజు అన్నారు. 'భారతరత్న' గా కేంద్ర ప్రభుత్వం ఘంటసాలను గుర్తించాలని ఆయన కోరారు. శుక్రవారం రాత్రి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై రసనాథ క్రియేషన్స్ సరిగమ మ్యూజిక్ అకాడమీ నిర్వహణ ఘంటసాల శతజయంతి సందర్భంగా ప్రముఖ గాయకుడు రమణగొగణి గాయనీగాయకులతో కలిసి 101 ఘంటసాల పాటలు నిర్విరామంగా 12గంటలు పాడి శ్రోతల ప్రశంసలు పొందారు. ముఖ్యఅతిథిగా వంశీరామరాజు పాల్గొని ఉదయం తొలిపాట నుంచి చివరి 101 పాట వరకు రమణ గొంతులదే మాధుర్యం ఉట్టి పడిందని ఇది అపూర్వమని అభినందించారు.

● సద్గురు ఘంటసాల గాన రత్న బిరుదుతో రమణను సినీనిర్మాత రామసత్యనారాయణతో కలసి వంశీ రామరాజు సత్కరించారు. ఈ సందర్భంగా రమణకు అరుదైన గాన ప్రయోగం చేసినందుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసాపత్రం అందజేశారు. సంఖ్యాక శాస్త్రజ్ఞుడు భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

చిలకలగూడ: సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రతినిధి తిరుపతన్న, టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్ కుమార్, సీనియర్ నాయకుడు గౌరీశంకర్‌ల నేతృత్వంలో కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త జలంధర్‌రెడ్డి, నాయకులు వినోద్, నిర్మల్‌కుమార్, విష్ణు, ప్రవీణ్, జాక్, జాషువ, రమేష్, రామాంజనేయులు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే, పార్లమెంట్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

దుకాణదారులపై దాడి.. ఇద్దరిపై కేసు

సుల్తాన్‌బజార్: షూ విషయమై తలెత్తిన ఘర్షణలు ఇద్దరికి గాయాలపాలైన ఘటన శుక్రవారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూధన్ తెలిపిన వివరాల ప్రకారం..అనిల్‌కుమార్ కోఠిలోని కామంత్ హోటల్ పక్కన కాలేజ్ షూస్ షాప్ నిర్వహిస్తున్నాడు. అస్గర్ అనే వ్యక్తి షూలు కొనేందుకు వచ్చి మాటామాటా పెరగడంతో అనిల్‌పై చెయ్యిచేసుకున్నాడు. ఈ విషయమై అనిల్ తన అన్న హుస్సేనప్పకు సమాచారం అందించడంతో హుస్సేనప్ప తన కజిన్‌తో అనిల్ షాప్‌కు వచ్చి గొడవ పడిన అస్గర్‌ను నిలదీయడంతో అస్గర్ అతనిపై బీరు బాటిల్‌తో దాడి చేశాడు. అస్గర్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు సంవేత్‌ఖాన్, మహబూబ్‌లు సైతం వారిపై దాడి చేయడంతో వారికి మెడ, నుదిటి భాగంలో గాయాలయ్యాయి. దీంతో హుస్సేనప్ప సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాధితులను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

సికింద్రాబాద్ జిల్లా కోసం పూజలు

ఉస్మానియా యూనివర్సిటీ: సికింద్రాబాద్ జిల్లాను ఏర్పాటు చేయాలని శ్రీ ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు. సికింద్రాబాద్‌లోని 7 అసెంబ్లీ నియోజక వర్గాలు త్వరితగతిన అభివృద్ధి చెందాలంటే జిల్లాను ఏర్పాటు చేయాలన్నారు. సికింద్రాబాద్‌ను జిల్లాగా ప్రకటిస్తే 1116 కొబ్బరికాయలను కొట్టి మొక్కుతీర్చుకుంటామని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాల్‌రాజ్‌యాదవ్, శైలేందర్, కృష్ణముదిరాజ్, అశోక్, శ్రీకాంత్‌రెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పరిపాలనాదక్షుడు బాబూ జగ్జీవన్‌రామ్

అంబర్‌పేట్ /ముషీరాబాద్ జోన్ పరిధిలో స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్త, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిబాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దేశ రాజకీయాల్లో ప్రధాన భూమిక పోషించిన గొప్ప వ్యక్తి, పరిపాలనాదక్షుడిగా దళితుల హక్కుల కోసం నిరంతరం కృషి చేశారని పలువురు నేతలు కొనియాడారు. దేశ తొలి ఉపప్రధానిగా ఆయన చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.
– అంబర్‌పేట్/ముషీరాబాద్‌జోన్ బృందం


గోల్నాక చౌరస్తాలో ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డిలు


బర్కత్‌పుర బీజేపీ కార్యాలయంలో డాక్టర్ గౌతమ్‌రావు, కార్పొరేటర్ ఉమ


ఫీవర్‌లో ఆస్పత్రిలో సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ జయలక్ష్మి


అడిక్‌మెట్ డివిజన్‌లో నివాళులర్పిస్తున్న సీనియర్ కాంగ్రెస్ నేతలు


ఇందిరాపార్కు చౌరస్తాలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ తదితరులు


సుందరయ్య పార్కులో నివాళులర్పిస్తున్న దృశ్యం


గాంధీనగర్ కార్యాలయంలో కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ తదితరులు

నేడు వివాహ పరిచయ వేదికలు


క్రైస్తవ వివాహ పరిచయ వేదిక..

కాచిగూడ: ఇండియన్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న శనివారం సికింద్రాబాద్‌లోని అమృతవాణి సెంటర్‌లో క్రైస్తవ వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. క్రైస్తవ వధూవరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 8885073555.

రెడ్డి వధూవరుల పరిచయ వేదిక..

కాచిగూడ: రెడ్డి క్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈనెల 6న ఉదయం 11 గంటలకు బషీర్‌బాగ్ ఫతేమైదాన్ క్లబ్‌లో రెడ్డి వధూవరుల పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎన్.శరత్ శ్యామ్ తెలిపారు. ముఖ్యఅతిథులుగా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కె.జనార్దన్‌రెడ్డి, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ చికాగో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ హరిందర్‌రెడ్డి పులియాల, నల్లపు ప్రభాకర్‌రెడ్డి తదితరులు హాజరవుతారని ఆయన తెలిపారు. వివరాలకు 9246176147.

9న సాయిబాబా ఆలయంలో 'ఉగాది' వేడుకలు



నల్లకుంట: బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో ఈనెల 9న తెలుగు సంవత్సరాది 'ఉగాది' వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సాయిబాబా సంస్థాన్ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రోజు ఉదయం ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. సాయంత్రం 7 గంటలకు పంచాంగ పఠనం ఉంటుందని చెప్పారు.

17న శ్రీరామ నవమి..

ఈనెల 17న (బుధవారం) షిరిడీ సాయిబాబా ఆలయంలో 'శ్రీరామ నవమి' వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సాయిబాబా సంస్థాన్ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 9.15 గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య 'శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం' ఉంటుందన్నారు. సాయంత్రం 7 గంటలకు భక్తి సంగీత కచేరి ఉంటుందని వివరించారు.

టీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉదయశ్రీ


ఇట్టా ఉదయశ్రీరెడ్డి

కాచిగూడ: ప్రముఖ విద్యావేత్త ఇట్టా ఉదయశ్రీరెడ్డిని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ (టీసీసీ) రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నియమించినట్లు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం బర్కత్‌పురలోని టీసీసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఉదయశ్రీరెడ్డి ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గత 20 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణ, శాంతి, మతసామరస్యం, కేన్సర్, క్షయవ్యాధి నివారణ, గుండె జబ్బులు, చక్కెర వ్యాధి, హైపర్ టెన్షన్, జాతీయ సమైక్యత, విద్యార్థిని మహిళా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు.

వీఎస్టీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్


ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్: వీఎస్టీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు కంపెనీలో పనిచేస్తున్న ముస్లింలకు రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వి.శ్రీనివాస్‌రెడ్డి కంపెనీ హెచ్ఆర్ మేనేజర్, అమిత్ అరోరా, టెక్నికల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీరామ్, ప్రధాన కార్యదర్శి అలీ, ప్రభాకర్, ఆఫీస్ బేరర్స్ బాబీ నరేందర్‌గౌడ్, రవియాదవ్, రణధీర్‌రెడ్డి, సత్యనారాయణ, మధు, శంకర్ తదితరులున్నారు.

చిక్కడపల్లితో శాంతిస్వరూప్‌కు విడదీయని అనుబంధం


శాంతిస్వరూప్ (ఫైల్)

చిక్కడపల్లి: దూరదర్శన్ తొలితరం న్యూస్ రీడర్ శాంతిస్వరూప్ చిక్కడపల్లితో విడదీయరాని అనుబంధం ఉంది. 1980 దశకం ప్రాంతంలో ఆయన దాదాపు 30 ఏళ్ల చిక్కడపల్లిలోని తమ సొంతిట్లోనే ఉండేవారు. ఆయన విద్యాభ్యాసం కూడా ఇక్కడే ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల ఆంధ్రా విద్యాలయంలో జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు 2000 సంవత్సరం వరకు ఆయన చిక్కడపల్లిలోనే నివసించి అనంతరం రామాంతపూర్‌కు తరలివెళ్లారని స్థానికులు చెబుతున్నారు. ఆయన ఇటీవలి వరకు త్యాగరాయగానసభ సిటీ సెంట్రల్ లైబ్రరీలో జరిగే పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సభకు అధ్యక్షత వహించి సభికులు, ప్రేక్షకులు, తోటి వేదికపైన ఉండే పెద్దలను కూడా ఆకట్టుకునేవారు.

జీహెచ్ఎంసీ కార్మికుడి అదృశ్యం


అరుణ్‌కుమార్ (ఫైల్)

నల్లకుంట: జీహెచ్ఎంసీలో పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జె.శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. కొడప్పగంటి అరుణ్‌కుమార్(27) జీహెచ్ఎంసీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తూ.. నల్లకుంట స్ట్రీట్‌నెంబర్ 9లో నివాసం ఉంటున్నాడు. గతనెల 30 నుంచి విధులకు హాజరుకాకపోవడంతో విషయం తెలుసుకున్న అతడి సోదరుడు సాయికుమార్ వివిధ ప్రాంతాల్లో వెతికాడు. ఫలితం లేకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నాంపల్లి జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని యువకుడు(30) హఫీజ్‌పేట్–చందానగర్ రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొట్టింది. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్రపరిచామని పోలీసులు తెలిపారు. కేసును దర్యాప్తు చేస్తున్నామన్నారు.